క్లుప్తంగా

మొగిలిలో అన్నదానం



అన్నదానం చేస్తున్న కరణం సంక్షేమ సంఘ సభ్యులు

బంగారుపాళెం: మహాలయ అమావాస్యను పురస్కరించుకుని ఆదివారం మండలంలోని మొగిలి శివాలయంలో కరణం సంక్షేమ సంఘం సభ్యులు అన్నదానం చేశారు. తొలుత స్వయంభు శ్రీమొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

నేటి నుంచి దసరా ఉత్సవాలు



ముత్యాలమ్మ

బంగారుపాళెం: స్థానిక గ్రామదేవత ముత్యాలమ్మ ఆలయంలో సోమవారం నుంచి దసరా, దేవీశరన్నవ రాత్రి ఉత్సవాలను 22వ తేదీ నుంచి 11 రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. రోజూ అమ్మవారు ఒక్కో అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని, తొలిరోజు సోమవారం చదనాలంకారం, 23న బాల త్రిపుర సుందరి, 24న గాయత్రిదేవి, 25న లలితా త్రిపుర సుందరి, 26న అన్నపూర్ణదేవి, 27న మహాదేవి, 28న సరస్వతీదేవి, 29న దుర్గాదేవి , 30న మహిషాసుర మర్ధిని, అక్టోబర్ 1న రాజరాజేశ్వరిదేవి, 2న పుష్పాలంకారంలో అమ్మవారు దర్శనమిస్తారని వివరించారు. అలాగే, స్థానిక ఓంశక్తి ఆలయంలోనూ సోమవారం నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలియజేశారు.

మహాభారత యజ్ఞం ప్రారంభం



హరికథాగానం చేస్తున్న భాగవతారిణి శారద

తవణంపల్లె: స్థానిక ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో ఆదివారం ధ్వజారోహణంతో మహా భారత యజ్ఞం ప్రారంభమైంది. ఆలయ ధర్మకర్త గుడిసె మునస్వామి శెట్టి, కార్య నిర్వాహకులు ఆధ్వర్యంలో అర్చకులు ద్రౌపదీదేవి పాండవుల విగ్రహాలకు అభిషేకం, పూజలు చేశారు. అనంతరం శాస్త్రోక్తంగా ధ్వజారోహణం నిర్వహించారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి వచ్చే నెల 13వ తేదీ వరకు మదనపల్లెకు చెందిన భాగవతారిణి ఎ.శారద హరికథాగానం చేస్తారని తెలిపారు. 29 సోమవారం మధ్యాహ్నం బకాసుర బలి బండి, అదే రోజు నుంచి అక్టోబర్ నెల 12వ తేదీ రాత్రి వరకు వినాయక నాటక మండలి కళాకారులు తమిళంలో రాత్రి నాటక ప్రదర్శనలు ఉంటాయని ధర్మకర్త మునస్వామి శెట్టి తెలిపారు.

కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా అప్‌గ్రేడ్ చేయాలి



ఎమ్మెల్యే మురళీమోహన్‌కు వినతిపత్రం ఇస్తున్న రాజేష్‌రెడ్డి

ఐరాల: స్థానిక పీహెచ్‌సీని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా అప్‌గ్రేడ్ చేయాలని ఆదివారం ఆత్మ మాజీ చైర్మన్ అయిరాల రాజేష్‌రెడ్డి చిత్తూరులో ఎమ్మెల్యే మురళీమోహన్ కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ పీహెచ్‌సీకి 250 మందికి పైగా రోగులు వస్తున్నారని, పీహెచ్‌సీని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా అప్‌గ్రేడ్ చేస్తే అదనంగా పిడియాట్రిక్, డెంటిస్ట్, గైనకాలజిస్ట్‌లను నియమించుకోవచ్చన్నారు. ఆరు పడకల పీహెచ్‌సీ 30 పడకల ఆస్పత్రిగా మారడంతో పాటు ఎక్స్‌రే, స్కానింగ్, పోస్టుమార్టం వంటి సౌకర్యాలు కలుగుతాయని చెప్పారు.

శిథిలావస్థలో పశువైద్యశాల భవనం



గుడిపాల: గుడిపాలలోని పశువైద్యశాల భవనం శిథిలావస్థకు చేరింది. పైకప్పు పెచ్చులూడి కమ్మీ కనిపిస్తోంది. చిన్నపాటి వర్షానికే భవనం ఉరుస్తోందని, ఎప్పుడు కూలుతుందోనని సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. పశువైద్యశాలకు వస్తున్న మందులు, సబ్సిడీ విత్తనాలు తడుస్తున్నాయని చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నూతన భవనం నిర్మించాలని పాడి రైతులు కోరుతున్నారు.

ఉపాధి కూలీలకు ఈకేవైసీ తప్పనిసరి

పెద్దపంజాణి: ఉపాధి కూలీలు తప్పనిసరిగా ఈకేవైసీ చేసుకోవాలని ఎంపీడీవో బాలాజి తెలిపారు. ఆయన ఆదివారం మద్దలకుంటలో జరుగుతున్న ఈకేవైసీ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు అన్ని గ్రామాల్లోని ఉపాధి కూలీలను కలిసి ఈకేవైసీ చేసుకునేలా చూడాలని పేర్కొన్నారు. జూనియర్ ఇంజినీర్ సుబ్రమణ్యం, సిబ్బంది బాబు పాల్గొన్నారు.

మరమ్మతు వస్తువులకు తప్పని తిప్పలు

- ఏడాదిగా టెండర్లు పిలవని అధికారులు
- మెటీరియల్ కోసం చేతులు చాస్తున్న సిబ్బంది
- చిత్తూరు కార్పొరేషన్‌లో ఇంజినీరింగ్ విభాగం దుస్థితి



చిత్తూరు నగరంలోని సంతపేట బ్రిడ్జి వద్ద పైపులైన్ లీకేజీ పనులు చేస్తున్న మునిసిపల్ సిబ్బంది (ఫైల్)

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్‌లోని ఇంజినీరింగ్ విభాగంలో పరిపాలన గాడి తప్పింది. క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించడానికి అసిస్టెంట్ ఇంజినీర్లు లేరు. డీఈఈలు ఉన్నా క్షేత్రస్థాయిలో ఏమి జరుగుతోందో తెలియని పరిస్థితి. ప్రధానంగా నీటి సరఫరా విభాగంలోని సిబ్బంది పరిస్థితి దయనీయంగా మారింది. నీటి పైపులైన్ల రిపేర్లకు కావాల్సిన వస్తువులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కార్పొరేటర్లు, ఇన్‌చార్జ్‌ల వద్ద చేతులుచాచి, మెటీరియల్ తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

సొంత ఆదాయంపైనే మక్కువ..

రెండు లక్షలకు పైగా జనాభా ఉన్న చిత్తూరు కార్పొరేషన్‌లో 50 డివిజన్లలో దాదాపు 270 పవర్ నీటి బోర్లు ఉన్నాయి. నగర వాసులకు కలవకుంట నుంచి తాగునీటిని అందించడంలో ఇంజినీరింగ్ సిబ్బంది పాత్ర కీలకం. కలవకుంట ప్రాజెక్టులో ఏర్పాటుచేసిన బోర్లు, పైపులైన్ మరమ్మతు పనులు కొందరు అధికారులు, కాంట్రాక్టర్లకు కనక వర్షం కురిపిస్తున్నాయి. రూ.లక్షల విలువ చేసే మోటార్లు పాడైపోయాయంటూ పక్కన పడేసి టెండర్లకు వెళ్లడం, తప్పుడు బిల్లులతో రూ.లక్షలు కొల్లగొట్టడం ఇక్కడ యథేచ్ఛగా సాగుతోంది. స్టార్టర్లు కాలిపోయాయని, మోటార్లు పనిచేయడం లేదని, వైర్లు కావాలని చెబుతూ ఏటా దాదాపు రూ.20 లక్షలకుగా స్వాహా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదే సమయంలో క్షేత్రస్థాయిలో పైపులైన్లు రిపేర్లు, లీకేజీల నివారణకు కావాల్సిన వస్తువులను తెప్పించడంలో ఎవరూ శ్రద్ధ చూపించడం లేదనే విమర్శలున్నాయి. దాదాపు గత ఏడాది కాలంగా రిపేర్ల కోసం వస్తువులు లేకుండా సిబ్బంది నానా ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి పైపు పగిలిపోయి నీరు లీకవుతున్నా సరి చేయడానికి స్థానికంగా ఉన్న వార్డు ఇన్‌చార్జ్, కార్పొరేటర్‌ను అడిగి వస్తువులను తెప్పించుకోవాల్సి వస్తోందని సిబ్బంది వాపోతున్నారు. కొన్ని చోట్ల ప్రజల నుంచి కూడా చందాలుగా వసూలు చేసి రిపేర్లు పూర్తి చేస్తున్నారు.

ఎందుకింత నిర్లక్ష్యం..

ప్రతి ఏటా నీటి పైపులైన్ల నిర్వహణ కోసం ఇంజినీరింగ్ అధికారులు టెండర్లు పిలవాల్సి వుంది. ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది, ఏఈ, డీఈఈల సమన్వయంతో ఏయే వస్తువులు కావాలో చూసుకుని టెండర్లు పిలిచి, వస్తువులను స్టాకు ఉంచుకోవాలి. గత కొంతకాలంగా అత్యవసర పనుల పేరిట వస్తువులు తెప్పించడానికి అలవాటు పడ్డ అధికారులు.. ఇందులోనే చిలక్కొట్టుడు కొడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. టెండర్లు పిలిస్తే ఒక వ్యక్తికే పెద్ద మొత్తంలో లాభం చేకూరుతుందని భావించి, టెండర్లకు వెళ్లకుండా అత్యవసర పనుల పేరిట రూ.వంద ఖర్చయ్యే చోట.. రూ.వెయ్యి అవుతున్నట్టు లెక్కలు చూపించి జేబులు నింపుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

టెండర్లు పిలిచాం..

వాటర్ వర్క్స్, రిపేర్ల కోసం మెటీరియల్ కావాలని టెండర్ పిలిచాం. త్వరలోనే పనులు అప్పగించి, స్టాకు తెచ్చి ఉంచుతాం. కొన్ని వస్తువులు ఉన్నాయి. లేనివాటిని అత్యవసరం కింద అప్పటికప్పుడు తెప్పించి సిబ్బందికి ఇస్తున్నాం. సకాలంలో టెండర్లు ఎందుకు పిలవలేదో తెలుసుకుని, సిబ్బంది ఎవరైనా నిర్లక్ష్యం చేశారని తెలిస్తే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటాం.

– వెంకటరామిరెడ్డి, మునిసిపల్ ఇంజినీరు, చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్

నోటీస్ బోర్డు

- **వేదగిరివారిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్**

ఐరాల: మండలంలోని వేదగిరివారిపల్లెలో సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డెప్ప తెలిపారు. గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేస్తామన్నారు.

- **నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక**

చిత్తూరు అర్బన్ : చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ డే నిర్వహించనున్నట్లు కమిషనర్ నరసింహప్రసాద్ తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామని తెలిపారు.

ఐరాల: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ లోకేశ్వరి తెలిపారు. ప్రజలు తమ సమస్యలను తమ దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని కోరారు.

తవణంపల్లె: ఎంపీడీఓ తమ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ డే నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రెడ్డిబాబు తెలిపారు. మండలంలోని ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని కోరారు.

- **రెండు గ్రామాల్లో స్వస్త్ నారీ పరివార్ అభియాన్**

తవణంపల్లె: మండలంలోని మల్లకుంట, కె.పట్నంలో సోమవారం స్వస్థ్ నారీ పరివార్ అభియాన్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారులు ప్రియాంక, మోహన్‌వేలు తెలిపారు. ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి అలుపెరుగని పోరాటాలు



సమావేశంలో ఎన్నికైన యూనియన్ నూతన సభ్యులు

చిత్తూరు కలెక్టరేట్ : అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, మినీవర్కర్ల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తామని ఫోరం ఫర్ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేమేశ్వరి తెలిపారు. యూనియన్ నాయకులు ఆదివారం చిత్తూరులోని ప్రైవేట్ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీవర్కర్లు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. మన ప్రాజెక్ట్, మన సంక్షేమం, హక్కుల కోసమే ప్రత్యామ్నాయంగా ఫోరం ఫర్ అంగన్‌వాడీ యూనియన్‌ను ఏర్పాటు చేశామన్నారు. యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సరస్వతి మాట్లాడుతూ త్వరలో జిల్లా స్థాయిలో పూర్తి స్థాయి కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. అధికారంలోకి వచ్చి 15 నెలలు పూర్తవుతున్నా హామీలు నెరవేర్చకపోవడం దారుణమన్నారు. అనంతరం జీడీ నెల్లూరు ప్రాజెక్టు నుంచి శైలజను రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలిగా గోవిందమ్మ, చిలకమ్మ పలమనేరు ప్రాజెక్ట్ కార్యదర్శిగా, జీడీ నెల్లూరు ప్రాజెక్టు కమిటీ లీడర్లుగా సరస్వతి, హంసవేణి, నిర్మల, భాను, పవనకుమారి, లక్ష్మి తదితరులను ఎన్నుకున్నారు.

ఘనంగా అమావాస్య పూజలు



గుడిపాల: విశేషాలంకరణలో భద్రకాళి అమ్మవారు

గుడిపాల: మండలంలోని నరహరిపేట సమీపంలో ఉన్న భద్రకాళికా అమ్మవారి ఆలయంలో ఆదివారం అమావాస్య పూజలను ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు, అభిషేకాలు చేశారు. మహాల య అమావాస్య కారణంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. రాత్రి అమ్మవారికి ఉయ్యాల సేవ చేపట్టారు. భక్తులకు అన్నదానం చేశారు.

తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుందాం



దసరా వేడుకల్లో పాల్గొన్న ర్యాంకర్స్ పాఠశాల విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ర్యాంకర్స్ పాఠశాల కరస్పాండెంట్ రమణారెడ్డి తెలిపారు. పాఠశాలలో ఆదివారం ముందస్తు దసరా పండుగను జరుపుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చెడును విడిచి మంచిని అలవరచుకోవాలన్నారు. చెడుపై మంచి ఎప్పుడూ గెలుస్తుందన్నారు. రిటైర్డ్ ఎంఈవో రామ్మూర్తి నాయుడు మాట్లాడుతూ దుర్గాదేవి మహిషాసురుడు అనే రాక్షసుడిని సంహరించడంతో విజయ దశమి రోజున దసరా పండుగ జరుపుకుంటున్నట్టు తెలిపారు. విజయదశమి నాడు ఏ పని ప్రారంభించినా విజయం చేకూరుతుందన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన మహిషాసుర సంహార నాటకం, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డైరెక్టర్ జయశ్రీ, టీచర్లు, విద్యార్థుల పాల్గొన్నారు.

వలంటీర్ల ఆశలపై నీళ్లు చల్లినట్లేనా!

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యక్తులతో పాటు వ్యవస్థలపైన కూడా కక్ష కట్టింది. ప్రజలకు ప్రభుత్వానికి వారధిలా.. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ ఫలాలను లబ్ధిదారుల ఇంటి వద్దకే అందించి దేశ వ్యాప్తంగా మన్ననలు అందుకున్న వలంటీర్ వ్యవస్థను నిర్వీర్యం చేసింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో దేశంలోనే ఎక్కడా లేనివిధంగా ప్రప్రథమంగా వలంటీర్ వ్యవస్థ పురుడుపోసుకుంది. అనతికాంలోనే ప్రతిష్టాత్మకంగా ప్రజలకు ప్రభుత్వ సేవలు అందుతుండడంపై దేశమంతా ఏపీ వైపు చూసింది. అయితే ఇంత గొప్ప వ్యవస్థను కూటమి నేతలు ఎన్నికలకు ముందు ఆయుధంగా వాడుకుని.. అధికారంలోకి వచ్చాక అసలు వలంటీర్ వ్యవస్థే లేదు.. దానికి చట్టబద్ధతే లేదంటూ నిర్వీర్యానికి తొలి అడుగు వేశారు.

- గత ప్రభుత్వంలో ప్రజలకు సేవలందించిన వలంటీర్లు
- పారదర్శకంగా పథకాల అమలుకు కృషి చేసిన సేవకులు
- ఎన్నికలకు ముందు రూ.10 వేలు వేతనం ఇస్తామని చంద్రబాబు, పవన్ కల్యాణ్ హామీ
- అధికారంలోకి వచ్చాక అసలు వలంటీర్ వ్యవస్థకు చట్టబద్ధత లేదని ప్రకటించిన మంత్రి డోలా
- ఇప్పుడు ఒకటిన్నర ఏడాది దాటినా వలంటీర్ల ఊసెత్తని పాలకులు



కరోనా సమయంలో ఆరోగ్య కార్యకర్తలతో పాటు సేవలు అందిస్తున్న వలంటీర్లు(ఫైల్)

బంగారుపాళెం: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఆగస్టు 15న వలంటీర్ల వ్యవస్థను అమలులోకి తీసుకువచ్చారు. జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా పౌరసేవలను ప్రజల ముంగిటకు అందించేలా ఈ వ్యవస్థకు శ్రీకారం చుట్టి ఐదేళ్ల పాటు విజయవంతంగా కొనసాగించారు. ముఖ్యంగా ఒకటో తేదీన ఇంటి వద్దకే పింఛన్, ప్రజలకు అవసరమయ్యే ప్రతి పనిని లోకల్ గవర్నెన్స్‌లో భాగంగా సచివాలయాలకు అనుబంధంగా వలంటీర్లు సేవలందించారు. విపత్తుల వేళ వలంటీర్లు ఎనలేని సేవలు అందించి ప్రజల అభిమానాన్ని చూరగొన్నారు. జిల్లాలో 10 వేల మందికి పైగా ఉన్న వలంటీర్లు ఐదేళ్ల పాటు ప్రజలకు సేవలందించి.. ఇప్పుడు ఉపాధి లేక జీవితాలు దుర్భరంగా మారాయని వాపోతున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కడంతో నిశ్చేష్టులై ఉన్నారు.

ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్ ఇచ్చేవారు..

జిల్లాలో ప్రతి నెలా ఒకటో తారీఖున సగటున 2.50 లక్షల మందికి సుమారు రూ.3,800 కోట్లను లబ్ధిదారులకు పెన్షన్ల కింద వలంటీర్లు పంపిణీ చేశారు. వేకువజాము నుంచి మధ్యాహ్న సమయానికే 95 శాతానికి పైగా పంపిణీ పూర్తి చేసేవారు.

కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ఇంటింటా వైద్యసేవలతో పాటు వ్యాక్సినేషన్, ప్రభుత్వ సాయం అందజేతలో వలంటీర్లు కీలకంగా పని చేశారు. తమ ప్రాణాలను పణంగా పెట్టి సేవలందించారు.

అవినీతికి తావు లేకుండా..

వలంటీర్ వ్యవస్థ ద్వారా అవినీతికి ఆస్కారం లేకుండా.. నేరుగా పథకాలు ప్రజలకు చేరవేయడంతో దేశవ్యాప్తంగా గుర్తింపు దక్కింది. పలురాష్ట్రాల్లో వలంటీర్ల వ్యవస్థను అమలు చేసే ఉద్దేశంతో ఆయా రాష్ట్రాల ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కరోనా సమయంలో వలంటీర్లు అందించిన సేవలను జిల్లాస్థాయి ఉన్నతాధికారులు సైతం కొనియాడారు. వారి సేవలను గుర్తిస్తూ ఏటా ఉత్తమ సేవకులకు పురస్కారాలు అందించి ప్రోత్సహించారు.

ఎన్నికల ముందు.. తరువాత..

ఎన్నికల సమయంలో వలంటీర్లను కూటమి నేతలు వలంటీర్లకు గౌరవ వేతనం రూ.5 వేలు కాదు.. రూ.10 వేలు ఇస్తామని నమ్మించారు. వలంటీర్ వ్యవస్థకు తాము వ్యతిరేకం కాదని చెప్పారు. తీరా అధికారంలోకి వచ్చిన తరువాత వలంటీర్ వ్యవస్థ సరికాదని, చట్టబద్ధత లేదని గొంతు కోశారు. దీంతో జిల్లాలో 10 వేలమంది వలంటీర్లను తొలగించి వారి జీవితాలను అంధకారంలోకి నెట్టారు. వలంటీర్ల వ్యవస్థ ఏర్పడి ఆరేళ్లు పూర్తి కాగా.. వ్యవస్థ నిర్వీర్యమై ఏడాదిన్నర దాటింది.



ఇంటి వద్దే పింఛను అందిస్తున్న వలంటీర్(ఫైల్)

విధుల్లోకి తీసుకోవాలి..

కూటమి నేతలు అధికారంలోకి రాగానే వలంటీర్లను కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తరువాత వలంటీర్ వ్యవస్థను రద్దు చేయడంతో ఉపాధి కోల్పోయాం. వలంటీర్ వ్యవస్థను రద్దు చేసి ఏడాదిన్నర పైబడింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం యువతకు ఉపాధి కల్పించేలా వలంటీర్ వ్యవస్థను కొనసాగించాలి.

– గోపి, బంగారుపాళెం

నమ్మించి మోసం చేశారు

కూటమి నాయకులు ఎన్నికల ముందు వలంటీర్లకు అండగా ఉంటామని, జీతం రూ.10 వేలు ఇస్తామని నమ్మించారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే లక్షలాది మంది వలంటీర్లను తొలగించారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థకు ప్రత్యేక గుర్తింపు తీసుకు వస్తే.. కూటమి నాయకులు దగా చేశారు.

– మోనీషా, బంగారుపాళెం

దసరా సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే అడ్డుకుంటాం



విద్యార్థి జేఏసీ వైస్ చైర్మన్ షేక్ రెడ్డిమస్తాన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా దసరా సెలవుల్లో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు తరగతులు నిర్వహిస్తే అడ్డుకుంటామని విద్యార్థి జేఏసీ వైస్ చైర్మన్ షేక్‌రెడ్డి మస్తాన్ హెచ్చరించారు. ఆ సంఘ నాయకులు ఆదివారం చిత్తూరులో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నియమ, నిబంధనల మేరకు అన్ని యాజమాన్యాల కింద నడుస్తున్న విద్యాసంస్థలు దసరా సెలవులను తూచా తప్పకుండా పాటించాలన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా ప్రత్యేక తరగతుల పేరుతో విద్యార్థులను ఒత్తిడికి గురి చేస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం చైర్మన్ సద్దాం పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పెరిగిన చెట్లు

గుడిపాల: స్థానిక పశువైద్యశాల ఆవరణలో రోడ్డు పక్కనున్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ తీగచెట్లు పెరిగాయి. పశువైద్యశాలకు రైతులు తరచూ పాడి ఆవులను తోలుకు వస్తుంటారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి పిచ్చి మొక్కలను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తెలుగులో ఉత్తర్వులపై హర్షం

పలమనేరు: రాష్ట్ర ప్రభుత్వం ఒకేరోజు తెలుగులో 11 జీవోలను విడుదల చేయడం హర్షణీయమని స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి నిర్వాహకులు తులసీనాథం నాయుడు తెలిపారు. ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇదే స్ఫూర్తితో గ్రామ సచివాలయాల నుంచి రాష్ట్ర సచివాలయం దాకా తెలుగు భాషను వినియోగించాలని కోరారు. తెలుగు భాషాభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం మరింత కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.



విద్యుత్ దీపాలంకరణతో అమ్మవారి కటౌట్

చిత్తూరులో నవరాత్రి శోభ

- నేటి నుంచి దుర్గాంబ ఆలయంలో దసరా బ్రహ్మోత్సవాలు
- మండపాలు సిద్ధం
- విద్యుత్ దీపాలతో ప్రత్యేక అలంకరణ



దుర్గాంబ దేవస్థానంలో అమ్మవారిని కొలువు దీర్చేందుకు ఏర్పాటు చేసిన మండపం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలో ఆదివారం దసరా సందడి నెలకొంది. గిరింపేటలోని దుర్గాంబ, చాముండేశ్వరిదేవి, తేనబండలోని ముత్యాలమ్మ, గుర్రప్పనాయుడువీధిలోని అంకాళపరమేశ్వరి, పొన్నియమ్మ, ఆంజనేయస్వామి ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం చేశారు. అమ్మవారిని కొలువుదీర్చేందుకు ప్రత్యేక మండపాలను ఏర్పాటుచేశారు. విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయాల్లో సోమవారం ఉదయం అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేసి దసరా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించనున్నట్టు ఆలయాల కమిటీ సభ్యులు తెలిపారు. నవరాత్రుల్లో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనం ఇస్తారని వెల్లడించారు.